

పచ్చనేతలకు ఉపాధి

కూటమి నేతలు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను తొల గిస్తున్నారు. తమకు అనుకూలమైన వారిని నియమించుకుంటున్నారు. - 8లో



కారులో మంటలు

కారులో అకస్మాత్‌గా మంటలు చెలరేగాయి. ఈ ఘటన పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. - 8లో



కార్డులెప్పుడిస్తావు బాబు?

నాలుగు నెలలుగా కొత్త రేషన్ కార్డులు లేక పలువు రు అల్లాడుతున్నారు. మార్పులు, చేర్పులకూ ముప్పతిప్పలెదుర్కొంటున్నారు. - 8లో

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ (సంగీతం), మాస్టర్ ఆఫ్ కామర్స్, డిప్లొమా ఇన్ మ్యూజిక్ (సంకీర్తన, వర్ణం, అన్నమయ్య అంతరంగం)లో ప్రవే శానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారం, అర్హత, ఫీజు వివరాలు వంటి సమాచారం వర్సిటీ వెబ్‌సై ట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఈనెల 31వ తేదీలోపు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొ న్నారు. నవంబర్ 15వ తేదీన స్పాట్ అడ్మిషన్ల చేపట్టనున్నట్లు వెల్లడించారు. వివరాలకు .0877-2284524, 8121787415 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

డిజిటల్ టెక్నాలజీపై మహిళలకు ప్రత్యేక శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలకు, ఎస్ జీఓలకు ఆధునిక సాంకేతిక, డిజిటల్ టెక్నాల జీపై మూడు రోజుల పాటు శిక్ష ణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వీసీ వీ.ఉమ తెలిపారు. సోమవారం వర్సిటీలోని సావేరి సెమినార్ హాల్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ మహిళా వర్సిటీ, యునైటెడ్ నేషన్స్ ఏషియన్ అండ్ పసిఫిక్ ట్రెనింగ్ సెంటర్ ఫర్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ఫర్ డెవలప్మెం ట్ (ఏపీసీఐసీటీ) సంయుక్త ఆధ్వర్యంలో డిజి టల్ నైపుణ్యాభివృద్ధిపై జాతీయ సదస్సు నిర్వ హించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా వైఫై- డీఎక్స్, ఎంపవరింగ్ ఉమెన్ ఎంట్రపెన్యూర్స్ త్రూ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అనే అంశంపై మహిళా వ్యాపార, పారిశ్రామిక వేత్తలకు ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు శిక్షణ ఇవ్వ నున్నట్లు చెప్పారు. ట్రెనింగ్ ఆఫ్ ట్రెనర్స్ పేరుతో నిర్వహించే వైఫై డీఎక్స్ శిక్షణ ప్రపం చంలోని 18 దేశాలలో అమలు చేశారని తెలిపారు. యూఎస్, థాయిలాండ్, సింగ పూర్, ఫిలిప్పీన్స్ వంటి దేశాల నుంచి నిపుణు లైన ట్రెనర్స్ ఈ సదస్సుకు వస్తున్నారన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ రజిని, పీఆర్‌ఓ పాల్గొన్నారు.

'ఉప్పు'యోగమైన భూముల పరిశీలన!



భూములు పరిశీలిస్తున్న కేంద్ర బృందం

వాకాడు : ఉప్పు తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో సోమవారం సెంట్రల్ కామర్స్, అలాగే ఇండస్ట్రియల్ శాఖకు సంబం ధించిన అధికార బృందం వాకాడు మండలం, దుగ్గరాజపట్నం పరిధిలోని చీమలపాడు గ్రామం వద్ద భూములను పరిశీలించింది. డిప్యూటీ సెక్రటరీ రాజేష్ అసాతి పాల్గొన్నారు. చీమలపాడు వద్ద రెవెన్యూ అధికారులు గుర్తిం చిన దాదాపు 25 ఎకరాల ప్రభుత్వ భూము లను, తూపిలిపాళెంలో గతంలో దుగ్గరాజపట ్నం పోర్టు ఏర్పాటుకు కేటాయించిన పోర్టు భూములు, అక్కడే మిగిలి ఉన్న మరికొన్ని ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈ బృం దం వెంట తహసీల్దార్ రామయ్య, సిబ్బంది ఉన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు గడువు పెంపు

తిరుపతి అర్బన్: డీఎస్సీ ఉచిత శిక్షణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవడానికి ఈనెల 25వ తేదీ వరకు గడువు పెంచినట్టు ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి చెన్నయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా 21వ తేదీ వరకు గడువు ఇచ్చామని, కానీ అందరికీ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో మరో నాలుగు రోజులు పొడిగించినట్లు ఆయన వెల్ల డించారు. ఆసక్తి గల వారు జన్మభూమి.ఏపీ. జీవోవీ.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసు కోవాలని సూచించారు.

గడువులోపు అర్జీలను పరిష్కరించండి

తిరుపతి అర్బన్: గ్రీవెన్స్ సందర్భంగా ప్రతి సోమవారం వచ్చే అర్జీలను గడువులోపు పరి ష్కరించాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వ హించారు. ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్ సం దర్భంగా ఒకసారి ఇచ్చిన అర్జీపై... తర్వాత వచ్చే సోమవారం అర్జీ ఇచ్చేలా ఉండకూడద న్నారు. డివిజన్, మండల స్థాయిలో వస్తున్న అర్జీలకు గడువులోపు పరిష్కారం చూపిం చాలని స్పష్టం చేశారు.

తిరుపతి నగరంలో ఏపీ ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ల నిర్వాహకులు పేట్రేగిపోతున్నారు. అర్బన్ ప్రాంతం కావడంతో డ్రాపౌట్స్, ఉద్యో గోన్నతి అవసరమైన వారు పదో తరగతి, ఇం టర్మీడియెట్ కోర్సులను దూరవిద్యలో చేసేం దుకు ప్రైవేట్ స్టడీ సెంటర్లను ఆశ్రయిస్తు న్నారు. ఇదే అదునుగా నిర్వాహకులు అభ్య ర్థుల నుంచి వేల కొద్దీ ఫీజులను వసూలు చేసి జేబులు నింపుకుంటున్నారు. పాస్ గ్యారెంటీ స్కీంకు ఒక రేటు, తరగతులకు రాకపోతే మరో రేటు, చూచిరాతలకు ఇంకో రేటు విధిస్తూ అందినకాడికి దోచేస్తున్నారు. తిరుపతి జిల్లాలో సాగుతున్న 'ఓపెన్' దందా పై 'సాక్షి' ప్రత్యేక కథనం.

ఓపెన్ దందా!



తిరుపతి జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయం

- తిరుపతి జిల్లాలో విచ్చలవిడిగా ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్లు
- ఒక్క తిరుపతి అర్బన్‌లోనే 68 ప్రభుత్వ, ప్రైవేట్ స్టడీ సెంటర్లు
- పాస్ గ్యారెంటీ స్కీం పేరుతో అధిక మొత్తంలో వసూలు
- గుర్తింపులేని కేంద్రాల్లోనూ విచ్చలవిడిగా అడ్మిషన్లు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



చిత్తూరు కలెక్టరేట్ : తిరుపతి జిల్లాలో 'ఓపెన్' దం దా విచ్చలవిడిగా సాగుతోంది. చదువును మధ్యలో మానేసిన వారు పది, ఇంటర్మీడియెట్‌ను దూరవి ద్యలో పూర్తి చేస్తారనే ఉద్దేశంతో పాలకులు ఏపీ ఓపెన్ స్కూల్‌ను ప్రవేశపెట్టారు. ఇది ప్రైవేట్ స్టడీ సెంటర్లకు వరంలా మారింది. అడ్మిషన్ల కోసం వచ్చే అభ్యర్థులకు పాస్ గ్యారెంటీ స్కీం పేరుతో వలవేస్తు న్నారు. ఆపై అందినకాడికి దండుకుని జేబులు గల్ల చేస్తున్నారు. ఈ తతంగమంతా విద్యాశాఖకు తెలి సినా మామూళ్లకు అలవాటుపడి కొందరు అధికా రులు తమకెందుకులే అని మిన్నకుండిపోతున్నారు.

నిరక్షరాస్యుల కోసం ఓపెన్ విద్య

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఓపెన్ స్కూల్ సొసైటీని ప్రారంభిం చింది. గుర్తింపు పొందిన స్టడీ సెంటర్ల ద్వారా ఏటా ప్రవేశాలు కల్పించి వార్షిక పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. రెగ్యులర్ కోర్సులతో సమాన గుర్తింపు ఉండ డంతో ఓపెన్ విధానంలో పది, ఇంటర్‌లో చేరేం దుకు ఎక్కువమంది ఆసక్తి చూపుతున్నారు. తిరుపతి జిల్లాలో మొత్తం 68 స్టడీ సెంటర్లు ఉండగా.. అందులో ఏటా ఆరు వేల మందికిపైగా అభ్యర్థులు అడ్మిషన్లు పొందుతు న్నారు.

పర్యవేక్షణ తూచ్

పర్యవేక్షణ లేకపోవడంతో ఓపెన్ స్కూల్ స్టడీ సెం టర్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తు న్నారు. గతంలో జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ కేడర్ అధికారి ప్రత్యేకంగా ఉండేవారు. అయితే ప్రస్తుతం డీఈఓ కార్యాలయంలో ఉండే పదో తరగతి పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ కేడర్ అధికారి జిల్లా కో-ఆర్డినేటర్ బాధ్యతలను నిర్వహి స్తున్నారు. ఒకే అధికారి కావడంతో పర్యవేక్షణ అం తంతమాత్రమే. జిల్లా ఓపెన్ స్కూల్ కార్యాలయం ప్రత్యేకంగా ఉండాలి. అయితే తిరుపతి జిల్లాలో ఈ శాఖకు ప్రత్యేకంగా కార్యాలయమే లేదు. కలెక్టరే ట్‌లోని డీఈఓ కార్యాలయంలోనే ఒక విభాగంగా ఏపీ ఓపెన్ స్కూల్‌శాఖను నిర్వహిస్తున్నారు.

ప్రత్యేక తరగతుల ఊసే లేదు

ఓపెన్ స్కూల్ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. స్టడీ సెంటర్ల నిర్వాహకుల పెత్తనాన్ని తగ్గిం చేలా ఆన్‌లైన్ విధానం తీసుకొచ్చింది. పాఠ్య పుస్తకాలను సకాలంలో నేరుగా విద్యార్థుల ఇళ్లకే పోస్ట్ ద్వారా పంపించి, తరగతుల నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ఏడాది తరగ తుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. 2024-25 విద్యా సంవత్సరానికి సార్వత్రిక విద్యావిధానంలో పది, ఇంటర్‌లో ప్రవేశాలకు ఇంకా అడ్మిషన్లు కొనసాగుతున్నాయి. పలు దఫాలు గడువు పెంచిన అధికారులు.. చివరి అవకాశం అంటూ ఈనెల 25 వరకు ప్రవేశాలు పొందవచ్చని ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. షెడ్యూల్ మేరకు 30 తరగతులు నిర్వహించా లి. కానీ ఇప్పటికే చేరిన వారిని పరీక్షలకు సన్నద్ధం చేసే విషయంలో నిర్లక్ష్యం వహిస్తు న్నారు. తరగతులు నిర్వహిం చకుండానే ప్రత్యేకంగా లెక్చరర్లను నియమిం చుకున్నట్లు, తరగ తులు నిర్వహిస్తు న్నట్లు తప్పుడు నివేది కలు సృష్టించి ప్రభుత్వం నుంచి వచ్చే రెమ్యూనరేషన్, తరగతుల నిర్వహణ నగదును దోచుకుంటున్నారు.

నిలువు దోపిడీ



ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రైవేట్ స్టడీ సెంటర్లలో అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రైవేట్ స్టడీ సెం టర్లలోనే అధికంగా దోపిడీ సాగుతోంది. ఈ విషయం విద్యాశాఖ అధికారులకు సైతం తెలుసు. అయినప్పటికీ వారు పట్టించుకోరు. గతంలో మా సంఘం తరఫున అధికారులకు తెలియజేశాం. నిరసనలు చేపట్టాం. అయినా ఏ మాత్రం మార్పులేదు. తిరుపతి జిల్లా కేంద్రంలో కొన్ని చోట్ల అనుమతులు లేకున్నప్పటికీ స్టడీ సెంటర్ల పేరుతో అడ్మిషన్లు ఇస్తున్నారు.

\- నవీన్, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం, జిల్లా అధ్యక్షుడు

పరీక్ష ఫీజులు అధికం

ఓపెన్ స్కూల్స్‌లో ఇంటర్మీడియెట్ జనరల్ కేటగిరీ వారైతే రూ.1,400, రిజర్వేషన్ అభ్యర్థులకు రూ.1,100 ఫీజుగా చెల్లించాలి. పదో తరగతి జనరల్ వారికి రూ.1,300, రిజర్వేషన్ వారికి రూ.900 చెల్లిం చాల్సి ఉంటుంది. ప్రవేశం పొందే అభ్యర్థులు నేరుగా ఆన్‌లైన్ విధానంలో ఫీజు చెల్లించవచ్చు. అం గన్‌వాడీ , ఆశ కార్యకర్తలు, చిరుద్యోగులు ఈ కోర్సుల్లో ఎక్కువగా చేరుతున్నారు. దీంతో కొన్ని ప్రయివేట్ స్టడీ సెంటర్ల నిర్వాహకులకు పాస్ గ్యారెంటీ పేరుతో అధిక మొత్తంలో డబ్బులు వసూ లు చేస్తున్నారు. తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపే ట, గూడూరు, పుత్తూరులో అధికంగా ఫీజు వసూళ్లు చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి.

అర్జీలు 193.. వచ్చినవారు వెయ్యి మంది!

- ప్రజాపరిష్కార వేదికకు కిక్కిరిసిన జనం



హాస్టల్స్‌లో సీట్ల సంఖ్య పెంచాలని కలెక్టర్‌కు విన్నవిస్తున్న విద్యార్థినులు

తిరుపతి అర్బన్: తిరుపతి కలెక్టరేట్ సోమ వారం అర్జీదారులతో కిక్కిరిసింది. ప్రజాపరి ష్కార వేదికకు మొత్తం 193 అర్జీలు రాగా.. వాటిని అందించడానికి సుమారు వెయ్యి మం ది వచ్చారు. ఇందులో రెవెన్యూకు సంబంధిం చిన అర్జీలే 131 ఉన్నాయి. రోడ్లు, తాగునీరు, నిబంధనలకు విరుద్ధంగా బ్రాందీ షాపులు ఏర్పాటు తదతర సమస్యలపై అర్జీలు వచ్చా యి. ఒక్కో సమస్యపై పదుల సంఖ్యలో జనం వచ్చారు. అయితే కలెక్టరేట్‌తోపాటు ఇతర అధి కారులను కలవడానికి ఒకరు లేదా ఇద్దరికి మాత్రమే అనుమతి ఇచ్చారు. ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు మాత్రమే గ్రీవెన్స్ నిర్వహించేవారు. అయితే ఈ సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల కొనసాగింది.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

బాలికల హాస్టల్స్‌లో సీట్ల సంఖ్య పెంచాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి పలువురు విద్యార్థినులు విన్నవించారు. వసతి గృహాల్లో సీట్లు లేక పలువురు చదువుకు దూరమవుతు న్నారని వాపోయారు. వారికి ఎస్ఎఫ్ఐ విద్యా ర్థులు మద్దత్తుగా నిలిచారు.

- సిక్స్‌లేన్‌తో తమ గ్రామానికి దారిలేకుండా పోయిందని శ్రీకాళహస్తి మండలంలోని చిందేప ల్లి గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు.
- అర్జీదారులకు కుర్చీలు లేకపోవడంతో పలు వురు కింద కూర్చుని పడిగాపులు కాయాల్సి వచ్చింది.
- అర్జీలు రాయడానికి అవసరమైన మేరకు వీఆర్వోలను నియమించలేదు.

గ్రీవెన్స్‌లో కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, నరసింహులు తదితరులు వినతులు స్వీకరిం చారు.

ప్రజాసేవే లక్ష్యం.. ప్రాణాలు పణం!



అమరులైన పోలీసు కుటుంబ సభ్యులను సన్మానించిన కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు





అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు

- అమరులైన పోలీసులకు ఘన నివాళి
- రక్షక భటుల సేవలను కొనియాడిన కలెక్టర్, ఎస్పీ

తిరుపతి క్రైమ్: శాంతి భద్రతల పరిరక్షణకు దిక్సూచి పోలీస్ వ్యవస్థేనని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెం కటేశ్వర్ కొనియాడారు. సోమవారం తిరుపతి పరేడ్ గ్రౌండ్ వేదికగా జరిగిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి ఎస్పీ ఎల్.సుబ్బరాయు డతో కలసి ఆయన పాల్గొన్నారు. ముందుగా అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అలాగే అమరులైన 8 మంది పోలీసు కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అం దజేశారు. ఏడాదిలో దేశ వ్యాప్తంగా అమరులైన 216 మంది పోలీసులకు ఆయన ఘన నివాళి అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దేశ మంతా నిద్రలో ఉంటే పోలీసులు మేల్కొని శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం శ్రమిస్తున్నారన్నారు. కుటుంబంతో జరుపుకునే పండుగకు కూడా అందు బాటులో లేకుండా ప్రజల కోసం జీవించి ప్రాణాలను పణంగా పెడుతున్నారని తెలిపారు. వారి త్యాగానికి గుర్తింపుగా ప్రతి ఏటా అక్టోబర్ 21న పోలీసుల అమరవీరుల దినోత్సవం జరుపు కుంటున్నట్టు వెల్లడించారు. ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ భారత్-చైనా సరిహద్దులోని 16 వేల అడుగుల ఎత్తులో మంచు పర్వతాల మధ్యన ఉన్న వేడి నీటిబుగ్గ అమర జవానుల త్యాగాలకు ప్రతీకగా నిలిచిందన్నారు. దేశ సరిహద్దు ప్రాంతా లలో విధులు నిర్వహిస్తూ ఎంతో మంది వీర మరణం పొందారని, వారిని స్మరించుకోవడం ప్రతి భారతీయుని బాధ్యత అని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న పోలీసు సిబ్బంది సంక్షే మమే లక్ష్యంగా కార్యాచరణ చేస్తామన్నారు. అనం తరం జిల్లాలో అమరులైన ఎస్ఐ రెడ్డినాయక్, ఏఎస్ఐ యువరాజులునాయుడు, హెడ్ కానిస్టే బుళ్లు చలపతిరాజు, ఇలియాస్, శ్రీధర్‌బాబు, నాగ రాజ, కానిస్టేబుళ్లు విద్యాసాగర్, అనిల్‌కుమార్ కుటుంబ సభ్యులను కలెక్టర్, ఎస్పీ ఘనంగా సత్క రించారు. అదనపు ఎస్పీ వెంకట్రావు, పోలీసు అధి కారులు రవిమనోహరాచారి, రామకృష్ణ, సాయుధ దళం శ్రీనివాసరావు, డీఎస్పీలు గిరిధర్, వెంకటనా రాయణ, ప్రసాద్, రామకృష్ణాచారి, రవీంద్రారెడ్డి, రమణయ్య, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న అమరవీరుల పోలీసు కుటుంబ సభ్యులు



నివాళి



మీ సేవలు అజరామరం.. అందుకో సలాం!

హామీలు మరిచి..విధ్వంసాలా?

- కూటమి పాలనపై ధ్వజమెత్తిన మాజీ మంత్రి కాకాణి

పెళ్లకూరు: టీడీపీ పాలనలో ఎక్కడ చూసినా అమాయకులపై దాడులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఇళ్లపై విధ్వంసాలు, నాయ కులకు బెదిరింపులు తప్ప అభివృద్ధి మాటే లేదని మాజీ మం త్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీపొ ట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం తిరుపతి జిల్లా, చిల్లకూరు గ్రామంలో డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి నివాసం వద్ద మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో కలిసి ఆయన విలేకర్లుతో మాట్లాడారు. టీడీపీ పాలనలో సజావుగా వ్యాపారాలు చేసుకునే అవకాశం లేకుండా సిండికేట్‌కు రావాలంటూ బెదిరిం చడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇళ్లపైకి దాడులకు పాల్పడిన టీడీపీ నాయకులకు పోలీసులు వత్తాసు పలకడం మంచిది కాదన్నారు. చంద్రబాబు చెప్పే మాటలకు, చేసే పను లకు ఏమా త్రం పొంతన ఉండదన్నారు. మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని అప్పుడు టీడీపీ వాళ్లందరికీ వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామన్నారు. నాయకులు మద్దాల సోమశేఖర్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, ప్రిస్కిల్లా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి, పక్కన మాజీ ఎమ్మెల్యే కిలివేటి

జిల్లా ఎస్పీకి ఫిర్యాదు

టీడీపీ నాయకులు శిరసనంబేటి చైతన్యకృష్ణారెడ్డి, దువ్వూరు రాకేష్‌రెడ్డి, లోకేష్‌నాయుడు, ధయాకర్ తదితరులు చిల్లకూ రులో తన ఇంటి బయట గేటుకు తాళం వేసినట్లు డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తిరుపతిలో జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

దాడులు అడ్డుకున్నందుకు కేసులు

ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ ఇంటిపై టీడీపీ నాయకుల దాడిని గ్రామస్తులు అడ్డుకున్నారు. అయితే ఇక్కడి పోలీసులు దాడులకు పాల్పడిన 8 మంది టీడీపీ వర్గీయులతో పాటు దాడులను అడ్డుకున్న 11మంది గ్రామస్తులపై కేసులు నమోదు చేశారు.

టీడీపీ అరాచకాలపై పోరాటానికి సిద్ధం

నియోజకవర్గంలో అధికార టీడీపీ చేస్తున్న దుర్మార్గాలను అడ్డుకొనేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటాలకు సన్నద్ధమవుతోందని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. సోమవారం ఆయన సత్యనారాయణరెడ్డిని పరా మర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కొం దరు టీడీపీ నాయకులు సత్యనారాయణరెడ్డి ఇంటి గేటుకు తాళం వేయడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.80,530
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.7,300
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.1,00,400
రిటైల్ వెండి గ్రాము	రూ.103.40

క్లుప్తంగా

కలెక్టరేట్‌లో వర్మీకంపోస్ట్ అమ్మకాలు


వర్మీ కంపోస్ట్ అమ్మకాల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: తిరుపతి కలెక్టరేట్ వ్యాపార కేంద్రంగా మారిపోతోంది. సోమవారం వర్మీకంపోస్ట్ ఎరువులను విక్రయించుకోవడానికి వీలు కల్పించారు. ఆ మేరకు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సోమవారం వర్మీకంపోస్ట్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఇప్పటికే నెల రోజుల క్రితం ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేసిన కూరగాయలను కలెక్టరేట్ వద్ద విక్రయించుకోవడానికి అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. రెండు నెలల క్రితం చేనేత వస్త్రాలను అమ్ముకోవడానికి వీలు కల్పించారు. అయితే గ్రీవెన్స్ సందర్భంగా ప్రతి సోమవారం మాత్రమే విక్రయించుకోవడానికి వీలు కల్పించారు.

ఎవరి వ్యాపారాలు వారే చేసుకోండి


దుకాణదారులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ

చిల్లకూరు : వాకాడు మండలంలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వారు వారి వ్యాపారాలు వారే చేసుకోవాలని మరొకరి వ్యాపారాల్లో జోక్యం చేసుకోవద్దని ఎక్సైజ్ సీఐ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం 'సాక్షి'లో 'తప్పుకుంటావా.. దుకాణం అప్పగిస్తావా' శీర్షికన ప్రచురితమైన వార్తపై ఆయన స్పందించారు. ఈ మేరకు మద్యం దుకాణాలు దక్కించుకున్న వారితో సమావేశమయ్యారు. ఎవరికి వారు వ్యాపారాలు చేసుకోవాలని, ఎవరిపైనా ఒత్తిడి తీసుకురావడం మంచిది కాదని సూచించారు.

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



ఉపాధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్(ఫైల్)



పచ్చనేతలకు ఉపాధి

సవ్యంగా సాగుతున్న ఉపాధి పనుల్లో కూటమి నేతలు తలదూర్చారు. గతంలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లు వైఎస్సార్‌సీపీకి చెందిన వారంటూ కక్షగట్టి రాద్ధాంతం చేశారు. తమ వారిని నియమించాలంటూ అధికారులపై ఒత్తిడి తెచ్చిమరీ తప్పించారు. ఆపై తమకు అనుకూలమైన వారిని మేట్ల పేరుతో నియమించుకుని అడ్డదిడ్డంగా దోచుకు తింటున్నారు.

- ఇష్టారాజ్యంగా ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు
- కొత్తగా మేట్లను నియమించిన కూటమి నేతలు
- తగ్గిపోయిన పనిదినాలు
- ఇబ్బందులెదుర్కొంటున్న కూలీలు

వెంకటగిరి(సైదాపురం): ఉపాధి హామీ పథకంలో పచ్చపెత్తనం పెరిగిపోయింది. పనులు, సిబ్బంది విషయంలో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తమకు అనుకూలమైన వారిని నియమించుకుని కూలీల కడుపులు మాడ్చుతున్నారు. గతంలో వర్షాకాలం మినహా జిల్లా వ్యాప్తంగా నిత్యం 90 వేల నుంచి లక్ష మంది కూలీలకు పని కల్పించేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య క్రమేణా తగ్గిపోతోంది.

పథకం ప్రకారం తొలగింపు

జిల్లాలో 806 పంచాయతీలుండగా.. అందులో 2.66 లక్షల జాబ్‌కార్డులు కలిగిన కూలీలు ఉన్నారు. ఉపాధిహామీ పనులను ఫీల్డ్ అసిస్టెంట్లు (ఎఫ్‌ఏ), టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీఓలు పర్యవేక్షించేవారు. కొన్ని పంచాయతీల్లో సీనియర్ మేట్లు ఎఫ్‌ఏలుగా వ్యవహరించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సవ్యంగా సాగుతున్న ఉపాధి పనులకు అడ్డతగిలారు. తమకు అనుకూలమైన వారిని నియమించుకోవాలని అధికారులపై ఒత్తిడి పెంచారు. ఆపై ఒక్కో మండలంలో 20 నుంచి 30 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించేశారు. ఆపై తమకు అనుకూలమైన వారిని మేట్లుగా నియమించుకున్నారు. తర్వాత ఆధార్ కార్డులిచ్చి జాబ్‌కార్డులు అధికంగా పెంచాలంటూ వారిపై ఒత్తిడి చేస్తున్నారు. అంతేగాకుండా రాత్రిపూట యంత్రాలు పెట్టి పనులు చేస్తూ.. ఉదయం కల్లా పైపైనే పూతలు వేస్తున్నారు. వచ్చిన మొత్తాన్ని అప్పనంగా దిగమింగేస్తున్నారు.

ఆగని బెదిరింపులు

అక్కడక్కడా మిగిలిపోయిన ఒకరిద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను తప్పుకోవాలంటూ కూటమి నేతలు బెదిరింపులకు దిగుతున్నారు. తమ అక్రమ సామ్రాజ్యానికి అడ్డుగా ఉన్నారని పనులు జరగకుండా ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. దీంతో పనిదినాల సంఖ్య భారీగా తగ్గిపోతోంది. చేతినిండా పనిలేక.. పొట్టకు కూడులేక కూలీలు అల్లాడి పోతున్నారు.

జిల్లాలో..

మండలాలు	: 34
పంచాయితీలు	: 806
జాబ్‌కార్డులు	: 2.66లక్షలు
పనిదినాలు	: 2.22లక్షలు

మేము ఎవ్వరినీ తొలగించలేదు



మేము ఇప్పటి వరకు ఏ ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించలేదు. వారు స్వతహాగానే రాజీనామాలు సమర్పించారు. జిల్లాలో 40 నుంచి 50 మంది ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత ఉండేది. వాటి స్థానంలో కొత్త వారిని నియమించాం. వర్షాల కారణంగా పనిదినాల సంఖ్య తగ్గింది. వాటిని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జాబ్‌కార్డులు కలిగిన కూలీలకు పనులు కల్పించేలా చర్యలు చేపడుతున్నాం.

– శ్రీనివాసప్రసాద్, డ్వామా పీడీ, తిరుపతి

కారులో మంటలు

చంద్రగిరి: కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ప్రయాణికులు అప్రమత్తం కావడంతో పెను ప్రవదం తప్పిన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి, తొండవాడ సమీపంలో సోమవారం తెల్లవారు జామునైన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. రాజమండ్రికి చెందిన ఐదుగురు భక్తులు ఆదివారం వేలూరు సమీపంలోని గోల్డెన్ టెంపుల్‌ని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. తొండవాడ సమీపంలో జాతీయ రహదారిపై వెళ్తున్న క్రమంలో సోమవారం తెల్లవారు జామున కారు ఇంజిన్‌లో మంటలు వ్యాపించాయి. అప్రమత్తం అయిన భక్తులు వెంటనే కారులోంచి దిగి పరుగులు తీశారు. కళ్లెదుటే కారు పూర్తిగా దగ్ధమైంది. ఆపై అగ్నిమాపక అధికారులు ఘటనా స్థలానికి చేరు కుని మంటలను అదుపు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక పోలీసులు తెలిపారు.

కార్మికుల ఘర్షణ.. ఒకరి మృతి

శ్రీసిటీ పరిధిలోని చెరివి వద్ద ఘటన

సత్యవేడు: శ్రీసిటీ పరిధిలోని చెరివి గ్రామానికి సమీపంలో ఆదివారం రాత్రి ఇద్దరు కార్మికుల ఘర్షణలో ఒకరు మృతిచెందారు. సీఐ బీవీ శ్రీనివాసులు సోమవారం తెలిపిన మేరకు.. చెరివి సమీపంలో ఉన్న బాల్ కంపెనీ వద్ద షెడ్లు వేసుకుని జార్ఖండ్, ఇతర ప్రాంతాలకు చెందిన కార్మికులు నివసిస్తున్నారు. షెడ్లలో ఉంటున్న కాంట్రాక్టు కార్మికుడు షికారి ముర్ము (39).. మరో కార్మికుడు విక్రమ్ ముర్ము తల్లిని దూషించాడు. దీంతో షికారి, విక్రమ్ మధ్య ఘర్షణ జరిగింది. మద్యం మత్తులో ఉన్న ఇద్దరూ కొట్టుకుంటూ రాతిపై పడ్డారు. విక్రమ్ ముర్ము పిడిగుద్దులు గుద్దడంతో షికారి ముర్ము అక్కడికక్కడే చనిపోయాడు. షికారి ముర్ము నిందితుడు విక్రమ్ ముర్ముకు వరుసకు చిన్నాన్న అవుతాడు. సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ హరిప్రసాద్ ఘటనాస్థలంలో వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కాంట్రాక్టు లేబర్ ఏజెన్సీ ప్రతినిధి పురుషోత్తం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, పరారీలో ఉన్న నిందితుడిని త్వరలో పట్టుకుంటామని సీఐ తెలిపారు.

మహాత్మా.. మన్నించు!

- జాతిపిత పేరిట నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లో వైన్‌షాపు


గాంధీ మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం

చిల్లకూరు : జాతిపిత మహాత్మాగాంధీజీ ఆశయాలను కూటమి నేతలు నీరుగారుస్తున్నారు. ఆయన పేరుతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ వైన్ షాపును ఏర్పాటు చేసి మహనీయునికి తీరని అవమానం చేశారు. ఇంతటి దుర్మార్గం కళ్ల ముందే జరుగుతున్నా మున్సిపల్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. గూడూరు పట్టణ నడి బొడ్డున టవర్ క్లాక్ ప్రాంతంలో గాంధీజీ షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. ఇందులో గది అద్దెకు తీసుకున్నవారు మద్యం, మాంసం దుకాణాలు ఏర్పాటు చేయకూడదని జీఓను కూడా అప్పటి ప్రభుత్వం జారీ చేసింది. అయితే మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు ఆ కాంప్లెక్స్‌లో ఎలాంటి దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారో కూడా పట్టించుకోవడంలేదు. దీంతో రెండు రోజులు క్రితం కూటమి నేతల మద్దతుతో ఏర్పడిన సిండికేట్ ఆధ్వర్యంలో ఏకంగా వైన్ షాపు ప్రారంభించారు. రాత్రికి రాత్రి గాంధీజీ షాపింగ్ కాంప్లెక్స్‌లో మద్యం దుకాణం వెలియడంతో పట్టణ ప్రజలు ఉలిక్కి పడ్డారు. జాతిపితకు కనీస గౌరవం కూడా ఇవ్వకుండా వైన్‌షాపు పెట్టడంపై మండిపడుతున్నారు. మున్సిపల్ అధికారులు అనుమతి ఇవ్వడంపై ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఇదే మార్గంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా కార్యాలయానికి రాక పోకలు సాగిస్తుంటారు. ఆయన కూడా ఈ దారుణంపై దృష్టి సారించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ వైన్‌షాపును తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు .

దివ్యాంగురాలు అదృశ్యం


అదృశ్యమైన యువతి స్నేహ (ఫైల్)

తడ: మండలంలోని కారూరు పంచాయతీ, కారూరు మిట్ట గ్రామానికి చెందిన దివ్యాంగురాలు కావేరి స్నేహ(22) నాలుగు రోజులుగా కనిపించడం లేదని తల్లి అముద సోమవారం తడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు.. అముద మాంబట్టు సెజ్‌లోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తుండగా ఆమె భర్త నాగేష్ కూలి పనులు చేసుకుని జీవిస్తున్నారు. వీరి కుమార్తె స్నేహకు పుట్టుకతో మూగ, చెవుడు ఉంది. అంతే కాకుండా రాత్రి సమయంలో కళ్లు సరిగా కనిపించవు. ఈ క్రమంలో ఈ నెల 18వ తేదీ ఉదయం పది గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన స్నేహ తిరిగి మళ్లీ ఇంటికి చేరలేదు. కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేకపోవడంతో సోమవారం తడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ కొండపనాయుడు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

పాకాల: స్థానిక రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం.. ప్లాట్‌ఫాం నంబర్–03 ఎంట్రన్స్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్పీ పోలీసులు గుర్తించి సమాచారం అందించారు. మృతి చెందిన వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. ఆస్పత్రి ఓపీ చీటీలో శ్రీనివాసులు(65)గా ఉంది. మృతుని వివరాలు తెలిస్తే స్థానిక రైల్వే పోలీస్‌స్టేషన్‌కి సమాచారం ఇవ్వాలని సూచించారు. లేదా 9440416642, 9494228854 నంబర్లకు ఫోన్ చేయాలని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వే ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న వృద్ధురాలు

రేణిగుంట: రేణిగుంట పంచాయతీ పరిధిలోని సీబీఐటీ కాలనీ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. రేణిగుంట – పుత్తూరు పాత మార్గం సీబీఐడీ కాలనీ వద్ద బాలాజీ నగర్‌కు చెందిన ఖాసింబీ(65) రోడ్డు దాటుతున్న క్రమంలో బైక్ పై వస్తున్న గుర్తుతెలియని యువకులు ఆమెను ఢీకొట్టారు. గాయాల పాలైన వృద్ధురాలు చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రురాలి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రోడ్డు ప్రమాదానికి కారకులైన యువకులు ఎస్‌ఎస్ పురానికి చెందిన వారుగా స్థానికులు అనుమానిస్తున్నారు.

రెండు బైకులు ఢీ

– ఇద్దరికి తీవ్ర గాయాలు


ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

చిట్టమూరు(చిల్లకూరు): ఎదురురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం కొత్తగుంట సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. మండలంలోని బురదగాలి కొత్తపాళెం గ్రామానికి చెందిన మురళి బైక్‌పై కొత్తగుంటకు వస్తున్నాడు. అదే సమయంలో ఎదురుగా అనగొల్లపాళెం గ్రామానికి చెందిన గగ్గయ్య బైక్‌పై వస్తూ అదుపు తప్పి ఎదురుగా మురళి బైక్‌ను ఢీకొట్టాడు. ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 సిబ్బంది నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

హోరాహోరీగా అంతర్ కళాశాల క్రీడలు


క్రీడాకారులతో రిజిస్ట్రార్, డైరెక్టర్

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో సోమవారం నిర్వహించిన అంతర్ కళాశాల క్రీడలు హోరాహోరీగా సాగాయి. ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన కబడ్డీ పోటీలకు 25టీమ్‌లు, తైక్వాండో పోటీలలో 8విభాగాల నుంచి 22మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కబడ్డీ పోటీలలో తిరుపతి బీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల విజేతగా సత్తా చాటింది. ఎస్వీయూ టీమ్ రన్నరప్‌గా నిలిచింది. తైక్వాండో పోటీలలో సీకామ్, సిద్ధార్థ, ఎస్వీ ఆర్ట్స్, వింగ్స్ బిజినెస్ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ శివశంకర్‌రెడ్డి బహుమతులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. క్రీడల్లో సత్తా చాటినందుకు అభినందనలు తెలిపారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక


ప్రతిభ చూపిన క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, పీడీ

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల(ఎస్పీడబ్ల్యూజేసీ) విద్యార్థిని టీ.శ్రీలక్ష్మి జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–19 సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యింది. ఇటీవల ఏలూరు జిల్లాలో 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అండర్–19 సాఫ్ట్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు ఎస్పీడబ్ల్యూజేసీ విద్యార్థినులు టీ.శ్రీలక్ష్మి, ఎం.నిఖిత, పీ.తనూజలు పాల్గొని పతకాలు సాధించారు. ఈ పోటీల్లో టీ.శ్రీలక్ష్మి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీ.భువనేశ్వరి, పీడీ సాయిసుమతి తెలిపారు. అనంతరం విద్యార్థినులను వారు అభినందించారు.

జాతీయ రెజ్లింగ్ పోటీలకు ఎంజీఎం విద్యార్థినులు


రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ఎంజీఎం నగరపాలక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి బైరాగిపట్టెడలోని ఎంజీఎం నగరపాలక ఉన్నత పాఠశాల విద్యార్థినులు జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల విజయవాడలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14 రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఆ పాఠశాల 8వ తరగతి విద్యార్థిని బీ.జ్యోతిర్మయి 54 కేజీల విభాగంలో, 7వ తరగతి విద్యార్థిని టీ.ప్రణీత 30 కేజీల విభాగంలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించారు. వీరు ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించబోవు అండర్–14 జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆ పాఠశాల ఆవరణలో విద్యార్థినులను అభినందించారు. హెచ్ఎం కదిరిరవి, వ్యాయామ ఉపాధ్యాయిని ఎం.ప్రసన్నలక్ష్మి, శాప్ కోచ్ హిందూజా పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

– ట్రాఫిక్ నియంత్రణకు 17 వాహనాలు ప్రారంభం


ద్విచక్ర వాహనాలను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ

తిరుపతి క్రైమ్: తిరుమల, తిరుపతి పరిధిలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ఆధునిక సాంకేతికతతో ప్రత్యేకంగా రూపొందించిన వాహనాలను జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు సోమవారం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతిలో రోజురోజుకూ ట్రాఫిక్ పెరుగుతోందన్నారు. ఈ క్రమంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం తిరుపతిలో 17 వాహనాలు ప్రారంభించామన్నారు. తిరుమల, తిరుపతి పరిసర ప్రాంతాల్లో నిరంతరం ట్రాఫిక్‌ని క్రమబద్ధీకరిస్తాయన్నారు. తిరుమల, తిరుపతిలో ఏర్పాటు చేసిన వన్ వేలు, ఫుట్ పాత్ ఆక్రమణలు, రాంగ్ పార్కింగ్‌లపై దృష్టి సారిస్తాయన్నారు. ట్రాఫిక్‌పై ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ తిరుమలకు వచ్చే యాత్రికులు, స్థానికులకు అంతరాయం కలగకుండా చూడడమే లక్ష్యంగా ఈ వాహనాలు పనిచేస్తాయని తెలిపారు. వీటికి జీపీఆర్‌ఎస్ సిస్టం ఏర్పాటుచేశామని, పోలీసుల కదలికలపై కూడా నిరంతరం నిఘా పెడతామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారికి బ్రీత్ అనలైజర్ టెస్టులు చేసి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు. అదేవిధంగా తిరుమలలో ట్రాఫిక్ నియంత్రణ కోసం 12 ద్విచక్ర వాహనాలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరి ప్రారంభించారు.

కార్డులెప్పుడిస్తావు బాబు?

■ తిరుపతికి చెందిన శంకరయ్యకు ఇద్దరు పిల్లలున్నారు. వారికి ఆధార్ కార్డులు చేయించాడు. ప్రస్తుతం ఉన్న బియ్యం కార్డులో ఆ ఇద్దరి పిల్లలను చేర్పించాలని నాలుగు నెలలుగా ప్రయత్నిస్తున్నాడు. పలుమార్లు సచివాలయం, సివిల్ సప్లయ్ అధికారుల వద్దకు వెళ్లి అడినా వెబ్ పోర్టల్‌లో ఆప్షన్ లేదని, లాగిన్ పనిచేయడం లేదని అధికారులు సెలవిచ్చారు. దీంతో ఏం చేయాలో తెలియక తికమకపడుతున్నాడు.

.. ఇది ఒక్క శంకరయ్య పరిస్థితే కాదు. జిల్లాలో వందల మంది కొత్త రేషన్‌కార్డులు లేక.. ఉన్న రేషన్ కార్డుల్లో పిల్లలను చేర్చుకోలేక.. పెళ్లైన వారు కొత్త కార్డులు పొందలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినా సంబంధిత కూటమి నేతలు దీనిపై దృష్టి పెట్టకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.


రేషన్ కార్డులు

జిల్లా సమాచారం

రేషన్ కార్డుల సంఖ్య	- 6,03,000
ప్రతి నెలా బియ్యం	- 8350 మెట్రిక్ టన్నులు
రేషన్ దుకాణాలు	- 1,457
ఎండీయూ వాహనాలు	- 369

- నాలుగు నెలలుగా ఒక్క రేషన్‌కార్డూ ఇవ్వలేదు
- కొత్త కార్డుల కోసం 25 వేల మంది నిరీక్షణ
- మార్పులు, చేర్పుల కోసం మరో 30 వేల మంది ఎదురుచూపు

తిరుపతి అర్బన్: కొత్త రేషన్ కార్డుల కోసం పలువురు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. అంతే కాదు రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం సుమారు 30 వేల మంది కార్యాలయాల చుట్టూ క్యూ కడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నాలుగు నెలలుగా ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వకపోవడం.. పోర్టల్‌ను రీఓపెన్ చేయకపోవడంతో జిల్లాలో ఇంకో 25 వేల మంది తలలు పట్టుకుంటున్నారు.

గత ప్రభుత్వంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొత్త కార్డుకి దరఖాస్తు చేసుకుంటే వెంటనే కొత్త కార్డు మంజూరయ్యేది. మరుసటి నెల నుంచే ఆ కార్డులో ఉన్న వారికి ఇంటి వద్దకే వచ్చి రేషన్ సరుకులు అందజేసేవారు. ఈ కార్డు బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులతో పాటు ఆరోగ్యశ్రీ పథకం, పిల్లల చదువులు, రుణాలు, ఉపకార వేతనాలు, ఫీజు రియింబర్స్‌మెంట్ తదితర అన్ని పథకాలు పొందేవారు. ఏటా 8వేల మందికి కొత్త రేషన్‌కార్డులు తగ్గకుండా పంపిణీ చేశారు. 2019–2024 మార్చి వరకు 42 వేల కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేశారు. 56 వేల మందికి ఎప్పటికప్పుడు కార్డుల్లో తప్పులు ఉంటే సవరించుకునే సౌకర్యం కల్పించారు.

మార్గదర్శకాలు రాలేదు

ప్రభుత్వం నుంచి కొత్త రేషన్‌కార్డులు ఇవ్వడంపై ఇప్పటి వరకు ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. కార్డుల్లో మార్పులు, చేర్పులకు సంబంధించి స్పష్టత ఇవ్వలేదు. అందు కోసం ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే కొత్త కార్డులతోపాటు మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తాం.

–శేషాచలంరాజు, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి